మహా పడిపూజ

ఆల్విన్‌కాలనీ: కూకట్‌పల్లి ఎల్లమ్మబండ ఆటోస్టాండ్ 40 అడుగుల రోడ్డులో నవీన్‌పిళ్లై గురుస్వామి ఆధ్వర్యంలో అయ్యప్ప స్వామి మహా పడిపూజ నిర్వహిస్తున్నట్లు వెంకట రమణస్వామి తెలిపారు. ఈ నెల 12వ తేదీ ఉదయం 9 గంటలకు పూజా కార్యక్రమం ప్రారంభం అవుతుందని పేర్కొన్నారు. శ్రీ మకరజ్యోతి భజన మండలి ఆధ్వర్యంలో భక్తి పాటల కార్యక్రమం ఉంటుందని చెప్పారు.

ఆదిత్యానగర్‌లో..

కూకట్‌పల్లి సర్కిల్ ఆల్విన్‌కాలనీ ఆదిత్యనగర్‌లో అనంతుల సాయికిరణ్ గురుస్వామి ఆధ్వర్యంలో ఈ నెల 13వ తేదీ సాయంత్రం 6 గంటలకు మహా పడిపూజ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అరుణ్ గురుస్వామి పర్యవేక్షణలో పూజా కార్యక్రమం ఉంటుందని తెలిపారు. అయ్యప్ప స్వాములు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని కోరారు.

బోటనీ లెక్చరర్‌కు డాక్టరేట్

పటాన్‌చెరు టౌన్: పటాన్‌చెరు ప్రభుత్వ డిగ్రీ కళాశాల వృక్షశాస్త్ర విభాగాధిపతిగా పనిచేస్తున్న మల్లికకు ఉస్మానియా యూనివర్సిటీ డాక్టరేట్ ప్రకటించిందని డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వడ్లూరి శ్రీనివాస్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు.ఉస్మానియా యూనివర్సిటీ ప్రొఫెసర్ శైలజ పర్యవేక్షణలో "ఫైటో కెమికల్ యాంటీ ఆక్సిడెంట్- యాంటీ బ్యాక్టీరియల్ స్టడీస్ ఆన్ సేల్టిస్ టైమర్ సిస్ అండ్ ఇంపార్టెంట్ మెడిసినల్ ప్లాంట్" అనే టాపిక్‌పై పరిశోధన పత్రాలను సమర్పించినందుకు డాక్టరేట్ లభించింది. కళాశాల ప్రిన్సిపాల్‌తో పాటు అధ్యాపకులు హర్షం వ్యక్తం చేసి, సన్మానించారు. సీనియర్ అధ్యాపకురాలు ప్రవీణ, డాక్టర్ ఎస్ యోగిబాబు, అధ్యాపకురాలు పూనమ్ కుమారి, శివదీప్తి తదితరులు పాల్గొన్నారు.



భెల్ ఎంఐజీ కాలనీలోని చిల్డ్రన్ థీమ్ పార్కు ప్రధాన ద్వారం



వాకింగ్ ట్రాక్



పార్కులో ఓపెన్ జిమ్

చిన్నారి లోకం..

చుట్టేసివద్దాం..

శేరిలింగంపల్లి ఎంఐజీ కాలనీలో 5.3 ఎకరాల స్థలంలో 'చిల్డ్రన్స్ థీమ్ పార్కు'



ఆంపీ థియేటర్



చిల్డ్రన్స్ ప్లే ఏరియా

శేరిలింగంపల్లి: శేరిలింగంపల్లిలోని భెల్ ఎంఐజీ కాలనీలో జీహెచ్‌ఎంసీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన 'చిల్డ్రన్ థీమ్ పార్కు' ఆకట్టుకుంటోంది. నిత్యం ఉదయం, సాయంత్రం కాలనీవాసులు సేద తీరుతున్నారు. ఈ పార్కులోకి వస్తే ఆహ్లాదం కలుగుతుండడంతో వాకింగ్‌కు వస్తున్నారు. ఈ చిల్డ్రన్ థీమ్ పార్కును 5.3 ఎకరాల్లో ఏర్పాటు చేశారు

- పార్కులో వాకింగ్ ట్రాక్, సైకిల్ ట్రాక్ అందుబాటులోకి వచ్చాయి. వాకింగ్ ట్రాక్‌లో గ్రానైట్ ఫ్లోరింగ్, రెండు మీటర్ల వెడల్పు, 290 మీటర్ల పొడవుతో ఏర్పాటు చేశారు.
- సైకిల్‌ట్రాక్ ఫ్లోరింగ్ సిమెంట్ కాంక్రీట్‌తో



వెడల్పు 3 మీటర్లు, 260 మీటర్లు పొడవుతో నిర్మించారు. అలాగే ఓపెన్ జిమ్, యోగా చేసుకోవడానికి మెగా ఫ్లాట్‌ఫారమ్ కూడా అందుబాటులోకి తెచ్చారు. ఇక బర్త్‌డే, సాంస్కృతిక కార్యక్రమాలు, ఇతర కార్యక్రమాలను నిర్వహించుకునేలా ఆంపీ థియేటర్‌ను అందంగా తీర్చిదిద్దారు.

- కాలనీవాసులు సేద తీరేలా 16 బెంచీలు ఏర్పాటు చేశారు. ఆకట్టుకునేలా 4 'పరగోలా'స్‌ను ఏర్పాటు చేశారు
- గ్రీనరీ కోసం 10వేల మొక్కలు 25 రకాలు పెంచారు.
- చుట్టూరా గోడలకు రంగులతో పక్షులు, చేపలు, పలు రకాల చిత్రాలు .. చిన్నారులను ఆకట్టుకునేలా చోటా భీమ్, ఇతర బొమ్మలు వేశారు.

జేఎన్‌టీయూహెచ్ చెస్ పురుషుల జట్టు ఎంపిక



కేపీహెచ్‌బీకాలనీ: జేఎన్‌టీయూహెచ్‌లో మంగళవారం చెస్ పురుషుల జట్టును ఎంపిక చేశారు. సెక్రటరీ స్పోర్ట్స్ కౌన్సిల్ ప్రొఫెసర్ ఎన్ఎస్ దిలీప్, ఫిజికల్ డైరెక్టర్ డాక్టర్ నల్లగొండ అశోక్ పాల్గొన్నారు. జనవరి 8 నుంచి 11 వరకు చెన్నైలోని వెల్‌టెక్ యూనివర్సిటీలో జరిగే సౌత్ జోన్ ఛాంపియన్‌షిప్‌లో ఈ జట్టు పాల్గొననున్నట్లు సెక్రటరీ స్పోర్ట్స్ కౌన్సిల్ దిలీప్ తెలిపారు. సెలక్షన్ కమిటీ మెంబర్‌గా చెస్ చీఫ్ ఎస్. సుబ్బరాజు వ్యవహరించారు. వివిధ కళాశాలల నుంచి సుమారు 50 మంది క్రీడాకారులు సెలక్షన్‌లో పాల్గొన్నారు.

పాలాభిషేకం



పాలాభిషేకం చేస్తున్న మాజీ కార్పొరేటర్ సాయిబాబా, నాయకులు

రాయదుర్గం: ఖాజాగూడలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయం వద్ద తెలంగాణ తల్లి చిత్రపటానికి పార్టీ ఆధ్వర్యంలో పాలాభిషేకం చేశారు. అనంతరం గచ్చిబౌలి డివిజన్ మాజీ కార్పొరేటర్ కొమిరిశెట్టిసాయిబాబా మాట్లాడుతూ తెలంగాణ తల్లి రూపాన్ని మార్చడమంటే తెలంగాణ అస్తిత్వాన్నే మార్చివేయడమేనని విమర్శించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు చెన్నంరాజు, సతీష్, రాజుముదిరాజ్, జగదీష్, నారాయణ, శ్రీనివాస్, మధు, ఖాదర్‌ఖాన్, అలీమ్, తాహెర్, బురాన్ అజీమ్, సయ్యద్ అజీమ్ తదితరులు పాల్గొన్నారు.

మందుబాబులకు జరిమానా

పటాన్‌చెరు టౌన్: డ్రంకెన్ డ్రైవ్‌లో పట్టుబడ్డ వాహనదారులకు సంగారెడ్డి జిల్లా కోర్టు జరిమానా, జైలు విధించిన సంఘటన పటాన్‌చెరు ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ట్రాఫిక్ సీఐ లాలూనాయక్ తెలిపిన వివరాల ప్రకారం.. సోమవారం నిర్వహించిన డ్రంకెన్ డ్రైవ్‌లో 11 మందిని పట్టుకున్నట్లు చెప్పారు. పట్టుబడిన వాహన దారులను మంగళవారం సంగారెడ్డి కోర్టులో హాజరుపర్చగా ఇద్దరికి రూ.2 వేలు జరిమాన, అదేవిధంగా ఆరుగురికి రూ. 1500 చొప్పున జరిమానా, మరో ముగ్గురికి వెయ్యి చొప్పున జరిమానా విధించినటు పోలీసులు పేర్కొన్నారు.

కల్యాణలక్ష్మీ చెక్కుల పంపిణీ

శంషాబాద్ రూరల్: శంషాబాద్ మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన లబ్ధిదారులకు మంగళవారం ఎమ్మెల్యే టి.ప్రకాష్‌గౌడ్ కల్యాణలక్ష్మీ, షాదీ ముబారక్ చెక్కులను పంపిణీ చేశారు. పేద ప్రజలకు రాష్ట్ర ప్రభుత్వం అందజేస్తున్న ఈ ఆర్థిక సహాయం ఎంతో ఉపయోగకరమని ఎమ్మెల్యే అన్నారు.

బాక్స్‌టైప్ డ్రైన్ పనులు త్వరితగతిన పూర్తి చేయాలి

ఎమ్మెల్యే గాంధీ

శేరిలింగంపల్లి: లింగంపల్లి రైల్వే అండర్ బ్రిడ్జి వద్ద నిర్మిస్తున్న బాక్స్‌టైప్ డ్రైన్ పనుల్లో వేగం పెంచాలని శేరిలింగంపల్లి ఎమ్మెల్యే, పీఏసీ చైర్మన్ ఆరికెపూడి గాంధీ తెలిపారు. లింగంపల్లి రైల్వే అండర్ బ్రిడ్జి వద్ద వరద సమస్యను శాశ్వతంగా పరిష్కరించేందుకు రూ.4 కోట్లతో చేపట్టిన బాక్స్‌టైప్ డ్రైన్ పనులను కార్పొరేటర్ రాగం నాగేందర్ యాదవ్, జీహెచ్‌ఎంసీ అధికారులతో కలిసి మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా గాంధీ మాట్లాడుతూ బాక్స్ టైప్ డ్రైన్ పనులు తుదిదశలో ఉన్నాయన్నారు. శేరిలింగంపల్లి ప్రాంతంలో ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా ఉండేందుకు ఇప్పటికే అనేక ఫ్లైఓవర్లు, అండర్‌పాస్‌లు నిర్మించామని గుర్తు చేశారు. కార్యక్రమంలో ఈఈ దుర్గా ప్రసాద్, డీఈ ఆనంద్, ఏఈ భాస్కర్, నాయకులు యాదగిరి గౌడ్, రవీందర్ యాదవ్ పాల్గొన్నారు.



పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే గాంధీ, కార్పొరేటర్ రాగం నాగేందర్‌యాదవ్

ఇద్దరు అదృశ్యం

మియాపూర్: వేర్వేరు చోట్ల ఇద్దరు అదృశ్యమయ్యారు. మియాపూర్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... పాఠశాలకు వెళ్లమని తల్లి మందలించడంతో బాలుడు ఇంటి నుండి వెళ్లి తిరిగిరాని సంఘటన చోటు చేసుకుంది. మియాపూర్ గోకుల్‌ప్లాట్స్ కాలనీకి చెందిన కె. ఈశ్వరమ్మ చిన్న కుమారుడు ప్రకాష్(14), మియాపూర్ ప్రభుత్వ పాఠశాలలో 10వ తరగతి చదువుతున్నాడు. ప్రకాష్ గత 20 రోజులుగా పాఠశాలకు వెళ్లకుండా ఇంటి వద్దనే ఉంటున్నాడు. ఈ క్రమంలో సోమవారం ఉదయం తల్లి పాఠశాలకు వెళ్లమని ప్రకాష్‌ను మందలించడంతో వెళ్తున్నానని చెప్పి ఇంటి నుండి వెళ్లాడు. రాత్రి అయినా తిరిగి రాలేదు. దీంతో ఉపాధ్యాయులను అడుగగా పాఠశాలకు రాలేదని తెలిపారు. దీంతో కుటుంబ సభ్యులు చుట్టుపక్కల, బంధువులు, స్నేహితుల వద్ద వెతికినా ఆచూకీ లభించలేదు. దీంతో ఆందోళన చెందిన కుటుంబ సభ్యులు మియాపూర్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.



ప్రకాష్ (ఫైల్)

మరో ఘటనలో.. యువకుడు

ఓ యువకుడు అదృశ్యమైన సంఘటన మియాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఎస్ఐ మాణిక్యం తెలిపిన వివరాల ప్రకారం... ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం చిత్తూరు జిల్లా చిన్న కలికిరి గ్రామానికి చెందిన జ్ఞానశేఖర్ నాయుడు(22), మియాపూర్‌లోని గోకుల్‌ప్లాట్స్‌లో ఉంటున్న చిన్నాన్న దగ్గర ఉంటున్నాడు. గచ్చిబౌలిలోని ప్రైవేటు ఉద్యోగం చేస్తున్నాడు. ఈ క్రమంలో జ్ఞానశేఖర్ నాయుడు అక్టోబర్ 16వ తేదీ రాపిడో బైక్ బుక్ చేసుకుని బయటకు వెళ్లాడు. రాత్రి అయినా కూడా ఇంటికి తిరిగి రాలేదు. దీంతో కుటుంబ సభ్యులు బంధువులు, స్నేహితుల వద్ద విచారించినా ఫలితం లేకపోవడంతో కుటుంబ సభ్యులు మియాపూర్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.



జ్ఞానశేఖర్ (ఫైల్)

14న దత్తాత్రేయ స్వామి విగ్రహ ప్రతిష్ఠ

మూసాపేట: భరత్‌నగర్ కాలనీలోని హరిహర క్షేత్రంలో దత్తాత్రేయ స్వామి విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవం నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ చైర్మన్ పి.నాగిరెడ్డి మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. 14న సాయంత్రం 5.30 గంటల నుంచి రక్షాబంధనం, అంకురార్పణ, అగ్ని ప్రతిష్ఠ, 15న ఉదయం 6 గంటల నుంచి పుణ్యాహవచనం, ఆదివాసి హోమం, పంచామృతాభిషేకం, గో దర్శనం, ఉదయం 9.45 నిమిషాలకు స్వామి వారి విగ్రహ ప్రతిష్ఠ ఉంటుందని ఆయన తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు.

సీఎం కప్ క్రీడా పోటీలు ప్రారంభం



పోటీలను ప్రారంభిస్తున్న నియోజకవర్గ ప్రత్యేక అధికారి దేవుజ

పటాన్‌చెరు టౌన్: సీఎం కప్ క్రీడా పోటీలను పటాన్‌చెరు మైత్రీ మైదానంలో మంగళవారం నియోజకవర్గ ప్రత్యేక అధికారి దేవుజ ప్రారంభించారు. కబడ్డీ, వాలీబాల్ తదితర క్రీడలు నిర్వహిస్తున్నామని విజేతలను జిల్లా స్థాయికి పంపుతామని తెలిపారు. ఈ క్రీడలు 3 రోజుల పాటు జరుగుతాయని తెలిపారు.ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ యాదగిరి, తహసీల్దార్ రంగారావు, ఎంఈఓ నాగేశ్వరనాయక్, ఎంపీఓ హరిశంకర్ గౌడ్, పీఈటీలు పాల్గొన్నారు.

కాలనీల్లో మౌలిక వసతుల కల్పనకు కృషి

కార్పొరేటర్ మంజుల రఘునాథ్‌రెడ్డి

శేరిలింగంపల్లి: కాలనీల్లో మౌలిక వసతుల కల్పనకు పెద్దపీట వేస్తామని చందానగర్ డివిజన్ కార్పొరేటర్ మంజుల రఘునాథ్ రెడ్డి తెలిపారు. డివిజన్ పరిధిలోని సురక్షా ఎన్‌క్లేవ్‌లో రూ.30 లక్షల వ్యయంతో నిర్మిస్తున్న సీసీ రోడ్డు పనులను మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా మంజుల మాట్లాడుతూ సీసీ రోడ్డు పనులు త్వరితగతిన పూర్తి చేసేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఏఈ సంతోష్, కాలనీవాసులు రవి, చౌదరి, హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.



సురక్షా ఎన్‌క్లేవ్‌లో సీసీ రోడ్డు పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ మంజుల తదితరులు

ఎఫ్ఈడీసీయూటీఏ కార్యవర్గం ఎన్నిక

రాయదుర్గం: ఫెడరేషన్ ఆఫ్ సెంట్రల్ యూనివర్సిటీ టీచర్స్ అసోసియేషన్స్ (ఎఫ్ఈడీసీయూటీఏ)లో మహిళలకు అగ్రస్థానం కల్పించారు. ఎఫ్ఈడీసీయూటీఏ చరిత్రలో మొదటిసారిగా ఇద్దరు మహిళలను అధ్యక్ష, ఉపాధ్యక్ష స్థానాలకు ఎన్నుకున్నారు. రెండురోజుల క్రితం న్యూఢిల్లీలోని జవహర్ లాల్ నెహ్రూ యూనివర్సిటీలో జాతీయ కార్యవర్గ సమావేశంలో జేఎన్‌యూ టీచర్స్ అసోసియేషన్ నుంచి ప్రొఫెసర్ మౌసమి బసు అధ్యక్షురాలిగా, గచ్చిబౌలిలోని మనూ యూనివర్సిటీ టీచర్స్ అసోసియేషన్ నుంచి డాక్టర్ షబానా కేసర్ సూరి ఉపాధ్యక్షురాలుగా ఎన్నికయ్యారు. 2025-26 సంవత్సరానికి కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు.

రహదారుల అభివృద్ధికి నిధులు కేటాయించండి

మంత్రి కోమటిరెడ్డిని కోరిన ఎమ్మెల్యే

పటాన్‌చెరు: పటాన్‌చెరు నియోజకవర్గంలో రహదారులను విస్తరించడంతో పాటు, మరమ్మతు పనులకు నిధులు కేటాయించాలని మంత్రి కోమటిరెడ్డిని పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి కోరారు. మంగళవారం బంజారాహిల్స్‌లోని మంత్రి నివాసంలో కలిసి, వివిధ అంశాలపై చర్చించారు. ప్రధానంగా నియోజకవర్గంలో ప్రజలు ఎదుర్కొంటున్న రోడ్ల సమస్యలను మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. నియోజకవర్గంలో పరిశ్రమలు ఉండటంతో పాటు ట్రాఫిక్ సమస్య అధికంగా ఉందని, రోడ్లు తీవ్రంగా దెబ్బతిన్నాయని.. దీంతో వివిధ కాలనీల ప్రజలు, ఈ ప్రాంతంలో ఉన్న ఇంజనీరింగ్ కాలేజీలకు వచ్చే విద్యార్థులు నిత్యం ప్రమాదాల బారిన పడుతున్నారని ఎమ్మెల్యే మంత్రి దృష్టికి తీసుకువచ్చారు.పటాన్‌చెరు నుంచి శంకర్‌పల్లి వరకు ఉన్న డబుల్ లైన్ రోడ్డును నాలుగు లైన్‌లుగా విస్తరించాలని, ఇందు కోసం 84 కోట్ల రూపాయలు, పటాన్‌చెరు నుండి ఇంద్రేశం, పెద్దకంజర్ల మీదుగా బేగంపేట వరకు రహదారి విస్తరణకు 56 కోట్ల రూపాయల నిధులు కేటాయించాలని కోరారు. ఇందుకు సానుకూలంగా స్పందించిన మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి.. అతి త్వరలో రహదారుల అభివృద్ధి, మరమ్మతులకు నిధులు కేటాయిస్తామని హామీ ఇచ్చారు.



మంత్రికి వినతిపత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి

లీకేజీలు.. తాగునీరు కలుషితం!

లీకేజీలతో తాగునీరు వృథా.. మరోవైపు కలుషిత నీరు సరఫరా అవుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. కలుషిత నీటి సరఫరాలో వాటర్‌బోర్డు అధికారుల నిర్లక్ష్యం కొట్టొచ్చినట్లుగా కనిపిస్తోంది. కలుషిత నీరు వాడుకోలేకపోతున్నామని స్థానికులు వాపోతున్నారు. రోగాలబారిన పడుతున్నామని చెబుతున్నారు. గత్యంతరం లేక ..నీరు కొనే శక్తి లేక ఆ నీటిని వేడి చేసుకొని తాగుతున్నామని కూకట్‌పల్లి సర్కిల్ ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

- కలుషిత నీటి సరఫరాతో ఇబ్బందులుపడుతున్న ప్రజలు
- నెలలు గడుస్తున్నా పట్టించుకోని అధికారులు
- శాశ్వత పరిష్కారం చూపాలంటున్న కాలనీలవాసులు

ఆల్విన్‌కాలనీ: పైపులైన్‌ల లీకేజీలు, గేట్‌వాల్వ్‌ల వద్ద గుంతలతో కలుషిత నీరు సరఫరా అవుతోంది. లీకేజీలు ఏర్పడి నెలలు గడుస్తున్నా ఈ సమస్యకు శాశ్వత పరిష్కారం లభించటం లేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కలుషిత జలాల సరఫరాతో ప్రజలు విరేచనాలు, జ్వరాలు, గొంతునొప్పి వంటి రోగాల బారిన పడుతున్నారు.

లీకేజీ ప్రాంతాలు ఇవే..

కూకట్‌పల్లి సర్కిల్ పరిధిలోని ఆల్విన్‌కాలనీ పైపులైన్ రోడ్డు, ఎస్ఎస్‌డీ స్కూల్ సమీపంలోని బ్రిడ్జి వద్ద ప్రధాన పైపులైన్‌పై ప్రయాణించే వాహనాల ధాటికి పైపులైన్‌లు పగిలి గుంతగా ఏర్పడింది. కొన్ని నెలలుగా చెత్తా చెదారంతో తాగునీరు కలుషితమై సరఫరా అవుతుందని ప్రజలు వాపోయారు. ఎల్లమ్మబండ ప్రధాన రహదారిలో, ఆస్‌బెస్టాస్ కాలనీ వాటర్ ట్యాంక్ వద్ద, పాపిరెడ్డినగర్ సమ్మక్క, సారమ్మ ఆలయం వద్ద మూలమలుపులలో, కూకట్‌పల్లి చిత్తారమ్మ దేవాలయం ప్రధాన రహదారిలో, వివిధ ప్రాంతాల్లో తాగునీటి పైపులైన్‌లు పగిలిపోయాయి. రోజూ లీకేజీల కారణంగా నీరు రోడ్డుపై ప్రవహించి రహదారులు సైతం గుంతలమయంగా మారుతున్నాయి. ఇప్పటికైనా సంబంధిత ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి తాగునీరు కలుషితంకాకుండా చర్యలు తీసుకోవాలని కాలనీల సంక్షేమ సంఘాల సభ్యులు, ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.



ఎస్ఎస్‌డీ స్కూల్ సమీపంలో ప్రధాన రహదారిలో పగిలిన మంచినీటి పైపు



ఆల్విన్‌కాలనీ పైపులైన్ రోడ్డులో బ్రిడ్జి వద్ద లీకవుతున్న ప్రధాన పైపులైన్



చిత్తారమ్మ ఆలయం ప్రధాన రహదారిలో గేట్‌వాల్వ్ లీకేజీ

మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించిన ఎమ్మెల్యే

శేరిలింగంపల్లి: శేరిలింగంపల్లి జిల్లా పరిషత్ హైస్కూల్‌లో విద్యార్థులకు అందజేస్తున్న మధ్యాహ్న భోజనాన్ని కార్పొరేటర్ రాగం నాగేందర్‌యాదవ్‌తో కలిసి ఎమ్మెల్యే గాంధీ మంగళవారం ఆకస్మిక తనిఖీ చేశారు .మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. అనంతరం విద్యార్థులకు అందజేసే మెనూ వివరాలను ఉపాధ్యాయులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా గాంధీ మాట్లాడుతూ పిల్లలకు నాణ్యమైన భోజనాన్ని అందించాలన్నారు. అదే విధంగా పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో నాయకులు యాదగిరిగౌడ్, రవీందర్‌యాదవ్ పాల్గొన్నారు.



విద్యార్థులకు అన్నం వడ్డిస్తున్న ఎమ్మెల్యే గాంధీ, కార్పొరేటర్ నాగేందర్‌యాదవ్

హనుమాన్ గాయత్రీ మహాయజ్ఞం

ఫిలింనగర్: ఫిలింనగర్ పరిధి వినాయకనగర్‌లోని పర్వతాంజనేయస్వామి ఆలయంలో శ్రీ హనుమాన్ గాయత్రీ మహాయజ్ఞం మంగళవారం వైభవంగా జరిగింది. ఆలయంలో హనుమాన్ మాల వేసుకున్న స్వాములు ప్రతియేటా ఇరుముడి కట్టుకోవడానికి ముందు రోజు గాయత్రీ యజ్ఞం చేస్తారని అర్చకులు రామానుజాచార్యులు తెలిపారు. ఈ సందర్భంగా స్వామి వారికి వేకువజామునే అభిషేకం చేశారు. పెద్ద ఎత్తున భక్తులు పాల్గొన్నారు. అనంతరం అన్నదానం చేశారు. కార్యక్రమంలో రామకృష్ణ గురుస్వామి, ఈదమయ్య గురుస్వామి, ఓర్సు శ్రీను, కరుణాకర్, శేఖర్, లింగరాజు, తిరుపతయ్య, రత్నయ్య, శ్రీరాములు, వెంకటయ్య పాల్గొన్నారు.



కార్పొరేటర్‌కు సన్మానం



కార్పొరేటర్ నాగేందర్‌ను సన్మానించిన సీనియర్ సిటిజన్స్

శేరిలింగంపల్లి: సీనియర్ సిటిజన్లకు ఎల్లవేళలా అందుబాటులో ఉంటానని శేరిలింగంపల్లి కార్పొరేటర్ రాగం నాగేందర్‌యాదవ్ అన్నారు. శేరిలింగంపల్లి హుడా ట్రేడ్ సెంటర్ కాలనీ సీనియర్ సిటిజన్ భవన్‌లో మంగళవారం జరిగిన ప్రత్యేక సమావేశానికి ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా నాగేందర్‌యాదవ్ మాట్లాడుతూ సమస్యలను నా దృష్టికి తీసుకువస్తే పరిష్కారానికి చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. సీనియర్ సిటిజన్ భవన్ అభివృద్ధికి సహకరించిన కార్పొరేటర్ నాగేందర్ యాదవ్‌ను శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో జయంత్‌కుమార్, వేణు, మోహన్‌రావు, పాండురంగయ్య, నర్సింహారావు, కాశీవిశ్వనాథ్, యాదయ్య, బుచ్చయ్య, డాక్టర్ మాణిక్ ప్రభు, కాలనీ అసోసియేషన్ ప్రతినిధులు పాల్గొన్నారు.

ప్రత్యేక పూజలు

ఆల్విన్‌కాలనీ: కూకట్‌పల్లి సర్కిల్ సమిత్రనగర్‌లోని చౌడేశ్వరి మాత ఆలయంలో కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి బండి రమేష్, సీనియర్ నాయకుడు గొట్టిముక్కల వెంకటేశ్వరరావు మంగళవారం ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో తూము వేణు, మల్లేష్‌యాదవ్, నాయకులు మహేందర్, రాజు, నర్సింహ, పాండు, ప్రవీణ్, దుర్గయ్య, నవీన్, బాలేష్, శేఖర్ పాల్గొన్నారు.